

# మమత

అలారం మోగీమోగ్గానే ఆపి పక్క దిగాను. చెల్లా చెదురుగా వున్న జుట్టుని సరిచేసుకొన్నాను. చీర సర్దుకొని గదిలోంచి బయటికి వస్తూ మంచం వైపు చూశాను.

మెడ వరకూ రగ్గు కప్పుకొని వెచ్చగా నిద్రపోతు న్నాడు కిషోర్. అదృష్టవంతుడు!

గడియారం వైపు చూశాను.

ఐదూ ఐదు.

పబ్లిక్ యెగ్జామ్స్ అయినా తెల్లారగట్ల లేచేదాన్నే కాదు. రాత్రి నిద్రొచ్చే వరకు చదువు, యెప్పుడు మెలకువ వస్తే అప్పుడే లేవటం. ప్చ్!

వంటగది తలుపు తీశాను.

డికాషన్ - పాలు మరగపెట్టడం- పిండి కలిపి- బియ్యం, పప్పు కడగటం- కూరలు తరగటం- అల్లం

వెల్లుల్లి నూరటం- కుర్మా... సాంబారు యింగువపోపు యిడ్లీ... చపాతీ... అన్నం... పప్పు... వేపుడు... పకోడీలు.

కీట్స్-ఉషావూతప్-కిరణ్‌బేడీ-ఫస్ట్ వరల్డ్-సెకండ్ వరల్డ్-థర్డ్ వరల్డ్ యుద్ధం... సంధి... అభివృద్ధి... వూహూఁ... అవన్నీ గతలోకపు మనో భావాలు... జ్ఞానం... యిప్పుడు... మనోగోళం చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు బ్రేక్‌ఫాస్ట్- లంచ్ - డిన్నర్.

తోమటం-కడగటం-తుడవటం-సర్దటం-వుతకటం-ఆరెయ్యటం-వడ్డించటం-ప్రపంచ వింతలు, సోయగాలు.

అత్త రుచి... ఆడపడుచు డైటింగ్... మావగారి హై బీ.పీ. పథ్యం... మరిదిగారి చైనీస్ ఫుడ్... మొగుడుగారి మసాల ఘుమఘుమలు.

వంటగది తలుపు మూశాను.

చీర మార్చుకునే వోపికా లేదు. నైటీతో తప్ప నిద్రపట్టని రోజులు పెళ్ళితోనే పోయాయి.

పక్కపై వాలుతూ గడియారం వైపు చూశాను.

పదకొండు అయింది.

"యింతాలశ్యమా? యింకో గంటపోయాక రాకపోయావా" విసుక్కుంటూ కసురుకుంటూ కిషోర్ దగ్గరికి లాక్కుంటున్నాడు.

మిక్సీలో మినప్పప్పు తిరుగుతున్నట్లు అతని చేతుల్లో శరీరం తిరుగు తోంది.

"రేపొద్దున్న యిడ్లీలోకి కొబ్బరిపచ్చడి చెయ్యాలా, పుట్నాలపప్పు చెట్నీ చెయ్యాలా? పల్లీ చెట్నీ అంటే అంతా యిష్టంగా తింటారు... ప్చ్! పల్లీలు అయిపోయాయి. తెప్పించటం మరిచిపోయాను. రేపు...తే..."

"నీ అంత జడపదార్థాన్ని నేనింతవరకు చూడలేదు," కిషోర్ విసుక్కుంటుంటే వులిక్కిపడ్డాను.

పెళ్ళయి ఆరునెలలు కాలేదు. నరనరాల్లో వంట కంపు ప్రవహిస్తోం దేంటి? యింకొన్నాళ్ళు పోతే మెదడు, గుండె యింగువ కంపు కొడతా యేమో...!

పెళ్ళయినవాళ్ళ జీవితాలు యిలానే వుంటాయా...? యిలానే వుండే ట్టయితే యిరవై మూడేళ్ళు ఆ యింట్లో గడిపిన జీవితంలో యిలాంటి జీవితాలని చూడలేదే?

అరే! పిచ్చి మమతా... నిన్న మొన్నటి వరకూ... నీకు తెలిసిన జీవితం యేంటి? నీ జీవన ప్రపంచంలో నీకున్న పరిచయాలు యెలాంటివి? నీ ఇష్టాలు నీ ఆశలు కోరికలు అభిరుచులు యేంటి?

పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే. అమ్మానాన్న వుద్యోగులు. అన్నయ్య, నేను పబ్లిక్ స్కూల్లో చదువుకున్నాం.

పాప్ మ్యూజిక్. బ్రేక్ డ్యాన్స్. యాక్షన్ ఫిక్షన్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్... దట్సాల్.

యింట్లో వంటమనిషి.

జీవితమంటే బాగా చదువుకోవటం. మంచి వుద్యోగం. పెళ్ళి, పిల్లలు వాళ్ళ చదువులు.

క్లాస్‌మేట్స్‌తో పాప్‌కార్న్ తింటూ - పిక్ యెన్ మూవ్‌లో ఐస్‌క్రీమ్స్ చప్పరిస్తూ మేం చర్చించుకున్నది ఫెమినాలోని డ్రెసెస్, బ్యూటి టిప్స్.

పెళ్ళి అనేది అంతవరకూ మాకెన్ని స్నేహాలు, పరిచయాలు వున్నా, వుండకపోయినా యింట్లో వాళ్ళు ఫిక్స్ చేసిన కుర్రాడితోనే.

బాగా చదువుకున్న కుటుంబంలోని కుర్రాడు, చూడటానికి బాగున్నవాడు, ఆర్థికంగా యే యిబ్బందులు లేకుండా డబ్బు పరంగా యెదిగే అవకాశాలున్న మంచి వుద్యోగం వున్నవాడు, మరీ పెద్ద ఫ్యామిలీ కాని యింట్లో కుర్రాడితోనే తల్లిదండ్రులు తమ అమ్మాయి పెళ్ళి చేసేవారు.

అన్నయ్యలో యివన్నీ చూసే వదిననిచ్చి వాళ్ళ పేరెంట్స్ పెళ్ళి చేశారు. పెళ్ళయి యీ యింటికి వచ్చాక వదిన వంటింటికేం అతుక్కు పోలేదు. తన వుద్యోగం, తన ఫ్రెండ్స్, తన యిష్టాలు యధావిధిగా జరిగాయి. అమ్మావాళ్ళ దగ్గర మూడు నెలలున్న తరువాత విడిగా వుంటామని అన్నయ్యా వదినా వెళ్ళిపోయిన రోజు కూడా యింట్లో యెవ్వరం అదో పెద్ద యిష్యూగా మాట్లాడుకోలేదు. వాళ్ళు ఆ యింట్లో

సెటిల్ కావటానికి అమ్మానాన్న తోడ్పడ్డారు. ఆ యింటికి వేం వెళ్ళేవాళ్ళం. వాళ్ళూ యింటికి వచ్చేవారు.

డిగ్రీ పూర్తయ్యాక టూరిజం యెండ్ ట్రావెలింగ్‌లో డిప్లమో చేశాను. తర్వాత వొక ట్రావెలింగ్ యేజన్సీలో పనిచేస్తుండగా కిషోర్‌తో పెళ్ళి నిశ్చయం అయింది.

బ్యాంక్‌లో ఆఫీసర్ వుద్యోగం. వాళ్ళ అమ్మగారికి ఎ.జి.ఆఫీసులో వుద్యోగం. వాళ్ళ నాన్నగారు రైల్వే వుద్యోగి. ఆడపడుచు యం.బి.బి.యస్. చదువుతుంది. పెద్దాడపడుచు లెక్చరర్. పెళ్ళయింది. అతను దుబాయ్ వెళ్ళాడు. ఆమె యీ యింట్లోనే వుంటుంది. మరిది యింజనీరింగ్ స్టూడెంట్.

అంతా చదువుకున్నారు. వుద్యోగాలున్నాయి. సొంత యిల్లు. సొంత బళ్ళు. వున్న సిటీలోనే... వంటమనిషి వుంది. అబ్బాయి బాగున్నాడు. అమ్మా నాన్న మరేం ఆలోచించలేదు. ఆలోచించటానికి యింకేమైనా వుంటాయని వాళ్ళకీ నాకూ కూడా తోచలేదు.

పెళ్ళయిపోయింది.

పెళ్ళయిన ఐదోరోజు నుంచే సెలవలు లేవంటూ కిషోర్ బ్యాంక్‌కి వెళ్ళిపోయాడు.

నాకు మరో వారంరోజుల లీవ్ వుంది. కాన్సిల్ చేసుకొని నేను ఆఫీసుకి వెళ్ళిపోదాం అనుకుంటూండగా కిషోర్, ''యెందుకు కాన్సిల్ చేసుకోవటం, వారమేగా. వంటమనిషి నాలుగురోజులు వాళ్ళ వూరు వెళతానంటుంది. నువ్వింట్లో వుంటే తను వెళ్ళొచ్చేస్తుంది,'' అన్నాడు.

''నాకు వంట సరిగ్గా రాదే.''

''ఆఁ దాన్దేముంది రెండ్రోజుల్లో అలవాటైపోతుంది.''

''మీకొచ్చా.''

''అబ్బెబ్బే రాదు...''

అదే మగవాళ్ళకైతే జీవితాంతం నేర్చుకున్నా అలవాటుకాదు. ఆడ వాళ్ళకి నిమిషాల్లో వచ్చేస్తుంది.

అలా మొదలయింది నా వంటలక్క జీవనం.

నాలుగురోజుల్లో వంటకి సంబంధించిన చాలా విషయాలు తెలిసి పోయాయి.

అంతవరకు ఆ వంటామె వొక్కపూటకి మాత్రమే వండి పెట్టి యింటికి వెళ్ళిపోయేది. వీళ్ళంతా వుదయం, మధ్యాహ్నం టిఫిన్ భోజనం బయట తినేవారు. యిప్పుడన్నీ యింట్లోనే.

వారం రోజులు గడిచాయి.

నేను ఆఫీసుకి బయలుదేరుతుంటే, "యెందుకొచ్చిన వుద్యోగం, గవర్నమెంట్ వుద్యోగానికి ప్రయత్నించు. కాంపిటీటివ్ యెగ్జామ్స్ రాయి. ఆ వుద్యోగం మాని యింట్లో వుండి చదువుకో," దగ్గరికి తీసుకొని నుదుటి పై ముద్దు పెట్టుకుంటూ అన్నాడు కిషోర్.

"వుద్యోగం చేస్తూ కూడా చదువుకోగలను."

"అలా చదివితే యెప్పటికొస్తుంది వుద్యోగం. యీ వుద్యోగం చేస్తూ చదువుకోవలసిన ఖర్మ నీకేంటి?" అంటూ జుట్టుని వేళ్ళతో నిమురుతూ నాజూగ్గా మమకారాన్ని కురిపించాడు.

వుద్యోగం మానలేదు. లాంగ్‌లీవ్‌కి ఆప్లయి చేశాను.

వుద్యోగం మానైటం యేంటని అత్తగారు రెండు మూడుసార్లు కొడుకుని మందలించారు.

'గవర్నమెంట్ వుద్యోగం,' అంటూ తన గొడవంతా కిషోర్ వినిపించాడు.

ఆమె తిరిగి మాట్లాడలేదు. ఆ విషయం కొడుక్కి సంబంధించిన విషయంగానే ఆమె భావించిందనుకుంటా!

అలా ఆరునెలలుగా జీతంబత్తెం లేని వంటలామెగా అంచెలంచెలుగా స్థిరపడిపోయాను.

కిషోర్ వుదయం యేడున్నరకి లేచి పేపర్ తిరగేసి రెడీ అయి బ్యాంక్‌కి వెళ్ళిపోతాడు. సాయంత్రం ఆరుగంటలకి వస్తాడు. వస్తూనే డ్రెస్ ఛేంజ్ చేసుకుని క్లబ్‌కి వెళ్ళిపోతాడు. రాత్రి తొమ్మిదింటికి వచ్చి అన్నం తిని కాసేపు నా శరీరాన్ని పలకరించి నిద్రపోతాడు. క్లబ్‌కి వెళ్ళకపోతే టి.వి.కి కళ్ళు అప్పచెప్పేస్తాడు.

నాతో బయటికి వెళ్ళాలనికానీ, యేమైనా మాట్లాడాలనికానీ అత నెప్పుడు ప్రయత్నించలేదు. నేనూ సాయంత్రం వరకు ఆఫీసులో గడిపి వస్తే యెలా ఆలోచించి యెలా ప్రవర్తించేదాన్నో కాని వుప్పు, చింతపండు డబ్బాలు, బుట్టలు, చూసి చూసి మరో ప్రపంచం లేక పాటలు వినే తీరిక, డ్యాన్స్ చేసే వోపిక లేక జీవితమంటేనే విరక్తి వచ్చేసింది. అతను మాట్లాడితే బాగుండుననిపించేది. నాకేం మాట్లాడాలో తెలిసేది కాదు.

బ్యాంక్ విషయాలు... ట్రాఫిక్ గొడవలు... క్లబ్‌లు టి.టి. ప్చ్! యివి యేవి సంబంధం లేని విషయాలు కదా...

అప్పటికీ వొకసారి, "యివాళ బ్యాంక్‌లో విశేషాలేంటి?" అన్నాను.

వెర్రిదాన్ని చూసినట్టు చూస్తూ, "యేమైంది?" అన్నాడు కిషోర్.

"ఆఁ యేంలేదు. వూరికే," దిక్కులు చూస్తూ అన్నాను.

"పకోడీలు బాగున్నాయా?"

"యింకాస్త కరకరలాడితే బాగుండును."

"దోసె బాగొచ్చిందా?"

"యింకాస్త పల్చగా రాదా?"

"పాయసం బాగుందా?"

"తీపి యెక్కువైంది. నీకు కేరళా వాళ్ళ పాయసం వచ్చా?" సో... వంట, వంటకాలు యీ సంభాషణ మా మధ్య బాగానే జరిగేట్టుంది...

కానీ అవి యెన్నాళ్ళు మాట్లాడినా నాకేం సంతోషంగా లేదు.

చిన్నగా గురక వినిపిస్తే ఆలోచనల నుంచి కిషోర్ వైపు చూశాను.

యెంత హాయిగా నిద్రపోతున్నాడో....

'బాప్‌రే! యిలా యెన్నాళ్ళు? యీ విషయం రేపు ఖచ్చితంగా కిషోర్‌తో మాట్లాడాలి,' అనుకొంటూ నిద్రలోకి జారిపోయాను.

◆ ◆ ◆

బ్యాంక్ నుంచి కిషోర్ వచ్చాడు. క్లబ్‌కి వెళ్ళలేదు. స్టార్ మూవీస్ ఛానల్‌కి అతుక్కుపోయిన కిషోర్‌తో "రేపట్నుంచి ఆఫీస్‌కి వెళతాను," అన్నాను.

"ఆఫీసుకా?"

"ఆఁ"

"యెందుకు?"

"యెందుకేంటి?"

"ఆఫీసుకెందుకు?"

"మీరు చేయటంలా?"

"నాతో పోలికేంటి గవర్నమెంట్‌ది."

" ఆ గవర్నమెంట్ వుద్యోగాలకో నమస్కారం. నాకీ వుద్యోగం చాలు."

"నువ్వు టింగురంగా అంటూ వుద్యోగానికి పోతే యిల్లెలా?"

"యింతమంది యీ యింట్లో వుద్యోగాలు చేస్తున్నా చదువు కుంటున్నా రాని ప్రశ్న నా దగ్గరకి వచ్చేసరికి వచ్చిందా?"

"యింట్లో వుండి యిల్లు చక్కపెట్టుకొంటావనేగా నిన్ను కట్టు కొంది."

"ఆ విషయం ముందు చెప్పలేదుగా."

"నీతో చక్కగా పనులు చేయిస్తున్నానని అంతా నన్ను మెచ్చు కుంటుంటే నువ్వేంటి ఆ యేడుపు మొహం. పరాయివాళ్ళకేదో పని చేస్తున్నట్టు, నీకా ట్రావెల్ యేజెన్సీలో వచ్చే జీతం నా జీతంలో నాలుగో వంతు లేదు. దానికింతగోల... పో... కాఫీ పట్రా... మంచి సినిమా... మజా మజా సీన్స్ పోతున్నాయ్," కసిరాడు కిషోర్.

యేడుపు మొహం. పరాయివాళ్ళు... ఆలోచిస్తూనే కాఫీ చేసి అతనికి యిచ్చాను.

◆ ◆ ◆

మర్నాడు వుదయం లేచి కాఫీ కలుపుకొని తాగాను. కిషోర్‌కి కాఫీ యిచ్చి నేను రెడీ అయ్యాను. కిషోర్ హాల్లో కూర్చొని పేపర్ తిరగేస్తున్నాడు.

"వెళుతున్నా," అన్నాను.

"యెక్కడికి?"

‘‘ఆఫీసుకి.’’

‘‘ఆఫీసుకా?’’ కనుబొమ్మలు చిట్లిస్తూ అన్నాడు కిషోర్.

‘‘ఆఁ ఆఫీసుకే.’’

‘‘వద్దన్నానుగా.’’

‘‘వద్దంటే..మానెయ్యాలా?’’ శాంతంగానే అడిగాను.

‘‘ఆఁ’’

‘‘నాకీ వంటపని నచ్చటం లేదు. వుద్యోగం చేస్తూ, పాటలు వింటూ ఫ్రెండ్స్‌తో పిక్ ఎన్ మూవ్‌లో గడిపిన రోజులే బాగున్నాయి. ఫెమీనా తిరగెయ్యటానికి కూడ తీరిక దొరకటం లేదు తెలుసా. వంటపని పూర్తిగా నేనొక్కదాన్ని భరించలేను. అంతా షేర్ చేసుకుందాం,’’ అన్నాడు.

‘‘వొక్కదానివి చెయ్యలేవా? అంతా షేర్ చేసుకోవాలా... యెందుకు చేసుకోవాలి. అమ్మావాళ్ళు చేస్తామన్నా నేనొప్పుకోను. యింటికి పెద్ద కోడలివి. నే చెపుతున్నా నీ భర్తని, నా మాట వినాలి. వుద్యోగం వద్దు. అసలేం వద్దు. నువ్వు యింటిని, పిల్లల్ని చూసుకుంటూ వుండడమే నాకిష్టం. వుద్యోగాలు చేస్తూ యింటిని ఆడవాళ్ళు పట్టించుకోకపోవటంతో యిళ్ళు ఎలా వుంటాయో, ఆ యింట్లో తిండానికి తిండి యెలా వుండదో నాకు బాగా తెలుసు. మా అమ్మ యింటిని, వుద్యోగ్యాన్ని చూడలేక సత మతమయ్యేది. మా అక్కని చూశావుగా ఆ వుద్యోగం వదల్లేక దుబాయ్ పోలేక యిక్కడే వుండిపోయింది. నువ్వే వుద్యోగం చెయ్యక్కర్లేదు.’’ కోపంగా అరిచాడు.

అప్పటికే యింట్లోవాళ్ళు హాల్లోకి తొంగిచూసి లోపలికి తప్పుకుంటు న్నారు.

‘‘మరి నాకీ జీవితం నచ్చట్లేదు,’’ మెల్లగా అన్నాను.

‘‘అదే నచ్చుతుంది. అలవాటవుతుంది. పిచ్చిపిచ్చి ఆలోచనలు మానేస్తే అన్నీ బాగుంటాయి.’’

‘‘నేనిలా యింట్లో వుండలేను.’’

‘‘యెక్కడ తిరుగుతావ్ వూరి మీద, నీదెంత మంచి జీవితమో నీకు అర్థంకావటం లేదు. మంచి వుద్యోగస్తుని భార్యవి. సొంత యిల్లు,

యిద్దరో ముగ్గురో పిల్లలుపుడితే వాళ్ళని పెంచాలి. నీకు ఖాళీయే దొరకదు. యెందుకొచ్చిన యీ ఆలోచనలు బుర్ర తిరుగుడు కాకపోతే,'' అన్నాడు.

చేతి గడియారం వైపు చూశాను.

మరో ఐదు నిముషాల్లో బయలుదేరకపోతే సమయానికి ఆఫీసుకి చేరుకోలేను.

మెల్లగా నచ్చచెప్పినా వినడు. యెన్నిసార్లు అడిగినా యిదే పాట. అడుగు ముందుకా - వెనక్కా...

వెనక నచ్చని నల్లని ప్రపంచం. ముందు రంగురంగుల ప్రపంచం. ఆ రంగులు జీవనాన్ని దేదీప్యమానం చేస్తాయో లేదో కాని తెలిసి తెలిసి నల్లని ప్రపంచంలోకి అడుగు వెయ్యలేకపోయాను.

అడుగు ముందుకు వేశాను.

''వెళితే వెళ్ళిపోవటమే తిరిగి యీ యింటికి రాకు,'' కఠినంగా కిషోర్ స్వరం హెచ్చరించింది. పాదం గుమ్మం దాటింది.

''యింట్లోంచి వచ్చేశావా?'' ఆశ్చర్యంగా అడిగింది అమ్మ.

అవునన్నట్లు తలూపాను.

''కోపంలో యేదో మాటవరసకి అంటే వెళ్ళకుండా వచ్చేస్తావా. వెళ్ళమ్మా యింటికి. యిలాగే గొడవలు పెరిగిపోతాయి,'' అన్నాడు నాన్న.

''కోపం వస్తే మాత్రం అలా మాట్లాడతారా. నా ఆఫీసు ఫోన్ నెంబర్ తెలుసు. ఫోన్ చేసి కోపంలో అన్నానని చెప్పొచ్చుగా,'' అన్నాను.

''పట్టుదలకి పోయి సమస్యని మరింత జటిలం చెయ్యకు,'' అన్నాడు నాన్న.

''యేంటి నాన్న మీరు కూడా నాదే పొరపాటన్నట్టు మాట్లాడతారు. అలా మాట్లాడే మనిషిని యేం అనకుండా నన్నంటారేంటి,'' అన్నాను.

ఆఫీసు నుంచి యింటికి వెళుతూ అమ్మావాళ్ళని చూడ్డానికి యింటికి వచ్చిన అన్నయ్య వదినలకి విషయం నాన్న చెప్పగానే ''అతనేమైనా తాగొచ్చి నిన్ను తంతున్నాడా... పేకాటలో కూర్చుని డబ్బు తగలేస్తున్నాడా... పోనీ చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నాడా,'' అన్నాడు అన్నయ్య.

“వో వారం వండి వడ్డిస్తే అర్ధమవుతుంది ఆ బాధ,” కోపంగా అంది వదిన.

“వంటంత కష్టమా,” స్వరం హెచ్చించి అన్నాడు అన్నయ్య.

“వంటే జీవితం అయితే నరకం,” చికాకుగా అంది వదిన.

“వాళ్ళేమైనా పరాయివాళ్ళా...? యెప్పట్నుంచో వుద్యోగాలకి అలవాటుపడ్డారు. అదీ గవర్నమెంట్ వుద్యోగాలు. నీకా గవర్నమెంట్ వుద్యోగం లేదు. వుద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు. మీ అమ్మ యెంతమందికి వడ్డించేదో తెలుసా,” నాన్న చెప్పుకుపోతున్నారు.

“మీరు పెద్దవుతున్నప్పుడు కదా యింట్లో వంటమనిషి,” అంది అమ్మ.

“అతను తను చేస్తున్న పొరపాటు తెలుసుకొని రియలైజ్ అయితే నేనతన్ని ఆమోదిస్తా. లేదా నేనతని నుంచి విడిపోతా,” స్పష్టంగా చెప్పాను.

“విడిపోతావా? యేంటతని పొరపాటు,” అన్నాడు నాన్న.

“యింట్లోనే వుండి వండి వడ్డించే అమ్మాయి కావాలని అతనికి వున్నప్పుడు విషయం ముందే చెప్పి అందుకు యిష్టపడిన అమ్మాయినే పెళ్లి చేసుకోవాలి. అప్పుడు యేమీ మాట్లాడకుండా యిప్పుడు యిలా యింట్లో అందరి పని చెయ్యాలని కండీషనలైజ్ చేయటం పొరపాటు కాదా,” అన్నాను.

“సరే ఆలోచిద్దాం. మనలో మనం వాదించుకోవటం యెందుకు,” అంటూ అమ్మ అందరిని శాంతపర్చటానికి ప్రయత్నించింది.

యిరవై రోజులు గడిచాయి. నాన్న అన్నయ్యల నచ్చచెప్పే రాయబారం కిషోర్ వినిపించుకోలేదు.

“యింటిపని చెయ్యననటమే మొదటి తప్పు. యిల్లొదిలి వెళ్ళటం రెండో తప్పు. తనకే అంత పొగరైతే నాకుండదా,” కిషోర్ వాదన.

“మేమేం చెయ్యగలం. వాళ్ళిద్దరి సమస్య. అయినా మా అబ్బాయి డబ్బుకోసం వేధించాడా. యే విషయానికైనా సాధించాడా. తన భార్య తనకి నచ్చినట్లు వుండాలనుకున్నాడు. యిల్లొదిలా వెళ్ళిపోతారా,” కిషోర్ యింటి సభ్యులు వాదన.

'ఆడపిల్లవి సర్దుకుపో,' వదిన తప్పా యింటిల్లిపాది వేడుకోలు.

"నీకేం తెలుసు పెళ్ళయి ఆరునెలలకే విడిపోవటం యెంత బాధో," వదినపై అన్నయ్య చిరాకు. చిన్నబుచ్చుకున్న వదిన.

కలుస్తామా-విడిపోతామా-బతుకో-బాధో యివేవీ ఆలోచించ నివ్వని సమస్య నాలో సుళ్ళు తిరుగుతోంది.

కావాలా - వద్దా!

కావలిస్తే యెందుకు! రూపం తెలియని ప్రాణి. మొలకగానే నూరేళ్ళు నిండిపోవలసిందేనా...

వద్దంటే! పెళ్ళి పేరుతో శరీరంపై హక్కుని పొంది యే కేర్ తీసుకోని కిషోర్, యేదైనా కేర్ తీసుకుందామంటే పడని పిల్స్, భయపెట్టే లూపులు- కాపర్‌టీలు.

యిప్పుడెలా...

అసలు నాకీ బిడ్డ యెందుకు ? తల్లివి కాబోతున్నావని డాక్టరమ్మ రిపోర్ట్స్ చూసి చెపుతున్నప్పుడు మనసుని లాలిరాగాలు గ్రీట్ చేయటం లేదే...

అమ్మని కాబోవటం ప్రపంచాన్ని జయిస్తున్నట్టుగా లేదే.

భారంగా జీవితంలో బోల్డంత కాలం పెంచటానికే వెచ్చిం చెయ్యాలా...

పిల్లల్ని కనటం పెంచటం మహత్తరానుభవమే కావొచ్చు. కానీ ఆ అనుభవం కోసం ప్రస్తుతం నా హృదయం వువ్విళ్ళూరటం లేదే...

వో నిశ్చయానికి వచ్చి డాక్టర్‌గారి దగ్గరికి వెళ్ళాను.

"అబార్షన్!? ఫస్ట్ చైల్డ్. యెందుకని?" ఆశ్చర్యంగా అన్నారు డాక్టర్. నేను మాట్లాడలేదు.

"మీరు మ్యారీడేగా?" కింది నుంచి పైకి యేగాదిగా చూస్తూ అడిగింది నలభై యేళ్ళ డాక్టరమ్మ.

పెళ్ళికాని వాళ్ళు మాత్రమే అబార్షన్ చేయించుకుంటారని, యిద్దరు ముగ్గురు పిల్లలు వున్నవాళ్ళూ చేయించుకోవచ్చనే డాక్టరమ్మ గారికి నేను యెందుకీ బిడ్డని వద్దనుకుంటున్నానో చెప్పేలోగా...

‘‘మీరు మీ భర్తా కలసి వుండటం లేదా, యేమైనా గొడవలా?’’ అన్నారు.

‘‘కలసిలేం. ప్రస్తుతం యీ బేబీ నాకొద్దు.’’

‘‘అరే మైడియర్ చైల్డ్! వర్రీకాకు. యెన్ని గొడవలున్నా పిల్లలవల్ల పోతాయ్. మీ భర్తకి యీ విషయం చెప్పారా ? లేకపోతే వెంటనే చెప్పండి. ఆల్‌ది బెస్ట్,’’ అందామె.

‘‘నో డాక్టర్! యీ బేబీ వలన మా మధ్య గొడవలు వుంటాయో పోతాయో వేరే విషయం. నేను అప్పుడే తల్లిని కావాలనుకోవటం లేదు,’’ అన్నాను.

‘‘విడిపోయినా మీకో బేబీ వుంటే లైఫ్‌కి సెక్యూరిటీ వుంటుంది కదా. తిరిగి కొన్నాళ్ళుపోయాక పిల్లలు కావాలనుకుంటే కష్టం కదా,’’ ఆప్యాయంగా నచ్చచెపుతున్న ఆమెని చూస్తుంటే అమ్మ గుర్తొచ్చింది.

‘‘కావాలనిపిస్తే అప్పుడే ఆలోచిస్తా. ప్రస్తుతం వద్దు. అబార్షన్‌కి టైమ్ డేట్ యివ్వగలరా?’’ అడిగాను.

ఆమె నావైపు వొక్కక్షణం తదేకంగా చూసి, ‘‘మీరంతగా చేయించుకోవాలనుకుంటే అలానే, కానీ మీవాళ్ళు అంటే మీ పేరెంట్స్, భర్త, యెవరైనా వుండాలి. మీకేమైనా అయితే డాక్టర్ల బాధ్యత లేదని సంతకం చెయ్యాలి,’’ అందామె.

‘‘థాంక్ యూ,’’ చెప్పి బయటికి వచ్చాను.

ఆ రాత్రి అమ్మకి మెల్లగా విషయం చెప్పాను.

‘‘పోనీలే యీ విషయం తెలిస్తే అబ్బాయి మనసు మారుతుందేమో,’’ సంతోషంగా ఆశగా అంది అమ్మ.

‘‘నేనీ బిడ్డని కనబోవటం లేదు. నాకంటూ నా జీవితం కావాలనే కిషోర్ నుంచి వచ్చేశాను. యిప్పుడు తిరిగి యీ బేబీని పెంచటంలోనే జీవితాన్ని పోగొట్టుకోలేను.’’

‘‘జీవితం! నీకెలాంటి జీవితం కావాలి? పెళ్ళి వద్దు. పిల్లలు వద్దు. యింకేం జీవితం,’’ అమ్మ అయోమయంగా అడిగింది.

‘‘వీటిని మించిన జీవితం వుందని నాకిప్పుడిప్పుడే తెలుస్తోంది.’’

“వాటిని మించిన జీవితమా?”

“ఆఁ, భూపేన్ హజారికాని విననంతకాలం శివానే గొప్ప గాయకుడు. రే సినిమాలు చూడనంతకాలం డి.సి.రావే గొప్ప దర్శకుడు. చలంగారు పరిచయం కానంతకాలం మిల్సన్ బూనే సాహిత్యం. కిషోర్‌తో పెళ్ళి కానంతకాలం పెళ్ళిలో సౌఖ్యం వుందనుకున్నాను. ప్రతిదీ అంతే,” అన్నాను.

అమ్మ భయం భయంగా నావైపు చూస్తూ, “కిషోర్ మారినా మారక పోయినా నీకంటూ వో బిడ్డ వుంటే మంచిదమ్మా. రేపు బాగా పెద్దయ్యాక నిన్ను చూడటానికి నీ పిల్లంటూ వుండాలి కదా. పెంపకం గురించి బెంగ పడకు. నేను బిడ్డని చూసుకుంటాను నీ వుద్యోగానికి అడ్డురాకుండా,” అంది.

“భలేదానివమ్మా, నిజంగా పిల్లలు కావాలనే కోరిక నాకు వస్తే కిషోర్‌తో యేం పనమ్మా? అసలు పెళ్ళితోనే పనిలేదు. కనాలనిపిస్తే వొకర్నేమిటి పదిమందిని కంటాను. కనటం అంటూ చేస్తే పెంచనా? నీపై భారం మోపుతానా ? ప్రస్తుతం బిడ్డ వద్దు,” అన్నాను.

అమ్మ మరింత కంగారుపడుతూ, “మమతా, నాన్నతో మాట్లాడతానమ్మా,” అంది.

◆ ◆ ◆

“పోనీలెండి ఆ బిడ్డకోసమేనా యింక వుద్యోగం గొడవ లేకుండా యింట్లో వుంటుంది. నన్నయితే కాదంది. కానీ యిప్పుడా పుట్టబోయే బిడ్డని కాదని వుండిపోలేదుగా,” అన్నాడంట కిషోర్ నాన్నతో.

“అదేంటి నాన్నా! నన్నడక్కుండా అతనితో యెందుకు మాట్లాడావ్? నేను కననని చెప్పానుగా,” అన్నాను.

“పిచ్చి పిచ్చి వేషాలు వేయకు. అసలు నువ్వు ఆ యింట్లోంచి వచ్చిన రోజే నిన్ను బలవంతంగా పంపించేయ్యాల్సింది. జీవితం అంటే యేమను కుంటున్నావో. రేపు వుదయం నిన్ను కిషోర్ యింట్లో అప్పజెప్పి నేను ఆఫీసుకి వెళతాను,” అన్నాడు నాన్న.

నవ్వొచ్చింది నాకు. ఆడవాళ్ళకి లోకం తెలియదంటారు. కానీ యేదైనా సమస్య వచ్చేసరికి స్త్రీలే నిలకడగా ధైర్యంగా ఆలోచించి ప్రవర్తించగలరు. మగవాళ్ళు భలే కంగారుపడతారే.

"నేను ఆ యింటికి రాను. యీ యింట్లో వుండిపోవటంలేదు," స్పష్టంగా చెప్పేశాను.

ఆ రాత్రి నా పుస్తకాలు సర్దుకుంటుంటే అమ్మ నా దగ్గరికి వచ్చి, "నా బిడ్డ, తనెలా అబార్షన్ చేయించుకుంటుంది అంటున్నాడట కిషోర్," అంది.

నా బిడ్డా... నా ఇల్లు... నా మనుష్యులు... పూర్ కిషోర్... సర్దు తున్నాను.

"బిడ్డల వల్ల సంసారాలు నిలబడతాయి పైపైకి. అలా నిలబడ డానికి మగవాళ్ళు చేసే త్యాగాలు, మారటాలు యేం వుండవ్. ఆడవాళ్ళే సర్దుకుపోతారు అన్ని విషయాలు పిల్లల కోసం. యెవరేమన్నా యెవరెంత గా మాతృత్వం గురించి గ్లోరిఫై చేసి మాట్లాడినా పిల్లలతో స్త్రీలకి వాళ్ల జీవితాలు వాళ్ళవి కాకుండా పోవటం నిజం. హాస్పిటల్లో నువ్వు అబార్షన్ చేయించుకోడానికి పేపర్లపై సంతకాలు అడిగారన్నావ్‌గా. నేను రేపు నీతో హాస్పిటల్‌కి వచ్చి ఆ సంతకాలన్నీ చేస్తా," అంది అమ్మ.

అమ్మ యెన్నెన్నో చేసింది నాకు. కానీ నేనెప్పుడూ అమ్మకి థాంక్స్ చెప్పలేదు. ప్రతీదీ టేకిట్ ఫర్ గ్రాంటెడ్‌గానే జరిగిపోతున్నాయి.

యిదీ అంతే కాకూడదు.

అమ్మ భుజాల చుట్టూ చేతులేసి బుగ్గపై ముద్దు పెట్టుకుంటూ, "థాంక్ యూ," అన్నాను.